



# పులిచంపిన లేడి నెత్తురు

పి. విజయలక్ష్మి

'దీనికంతటికీ నువ్వే కారణం.' అని నిష్ఠూరించాడు భర్త. మౌనంగా భరించింది పార్వతి. ఎవరేమన్నా భరించటం అలవాటయింది ఆమెకి ఈమధ్య.

కృష్ణ ఆమెకి ఒక్కగానొక్క కొడుకు. క్రితంరాత్రి బాగా ప్రొద్దుపోయి ఇల్లు చేరాడు కృష్ణ. అప్పుడు జోరున వర్షం పడుతూవుంది. ఇంట్లో అందరూ గాఢ నిద్రలో వున్నారు. పార్వతికి ఎంతగా ప్రయత్నించినా నిద్ర రాలేదు. మనసంతా కొడుకుని గురించిన ఆలోచనలతో నిండిపోయింది. నిద్ర లేమికి కళ్లు మంటలు పెడుతూ వున్నాయే గాని రెప్పలు మూతలు పడనేలేదు. నిద్ర పోదామని ప్రయత్నించినా నిద్ర రాలేదు.

అప్పుడు తలుపుతట్టి పిలిచాడు కృష్ణ. 'అమ్మా. అమ్మా.' అన్న ఆ పిలుపు విని చెంగున లేచి వెళ్లి తలుపు తీసింది పార్వతి. నిలువెల్లా తడిసిపోయి గజ గజ వణుకుతూ వున్నాడు కృష్ణ. తలంతా తడిసి జుట్టు నీరు వోడుతూ వుంది. బట్టలు ఒంటికి అతుక్కుపోయి వున్నాయి.

'రా బాబూ. అయ్యో! అలా తడిసి పోయావేంరా?' అంటు గబగబ లోపలికి తీసుకుపోయి కొంగుతో తల తుడిచింది. కృష్ణ బట్టలు మార్చుకొనే సమయంలో కోడల్ని నిద్రలేపి 'అబ్బాయి వచ్చాడు' అని చెప్పింది, కళ్లు ఇంత చేసుకొని ఆనందంగా. అయితే ఏమిటన్నట్టు విసుగ్గా చూసి మరల నిద్రలోకి జారుకుంది కోడలు; నిర్లక్ష్యంగా.

కోడలు వట్టి పెడసరం మనిషి. గయ్ గయ్ మంటుంది పూర్వే. మొగవాడ్ని ఎలా ఆకట్టుకోవాలో తెలీదు. అది చూసి మరింత రెచ్చిపోతాడు కృష్ణ. ఇద్దరికీ ఏరోజూ పడదు. పోట్లాడుకొంటూరు. సర్ది చెప్పపోతే విన్పించుకోరు, ఎవరూ. ఇదంతా చూసి ముసలాయన రుసరుసలాడుతాడు. 'ఇందులో కాదన్నేది ఏముంటుంది? తప్పేది ఏమిటి వుంది?' — అంటే కయ్‌మంటాడు 'ఖర్మ. ఖర్మ' అని గ్రుడ్లురిమి చూస్తాడు. నిందిస్తాడు. పార్వతినే పట్టుకొని అంటాడు ఏదైనా.

పొయ్యి వెలిగించి నెయ్యి కరగపెట్టేసరికి 'అన్నం పెట్టు అమ్మా. ఆకలి వేస్తోంది.' అంటూ వచ్చి పీట వాల్చుకొని కూర్చున్నాడు కృష్ణ.

'అయ్యో! నాతండ్రీ. ఎంత ఆకలిగా వున్నావోగదా.' అంటు కంచం పెట్టి వడ్డించింది. అంతవరకు పీటమీద కూర్చుని కొడుకు తన మొహంలోకే చూస్తూ వున్నట్టు గమనించలేదు పార్వతి.

'బాబూ తిను' అంది తల వంచుకొని వడ్డిస్తూనె, నిద్ర మొహంతోనే.

'అమ్మా!'

'ఏరా?! తిను నాయనా. ఆకలన్నావు గదా?'

'ఇంట్లో అందరూ తిన్నారు గదా, అమ్మా?'

'ఆ. అయినయి.'

'నీ కోడలు.'

'పసిపిల్ల. నీ కోసం కనిపెట్టుకొని వుంటానంటె వద్దని కోప్పడి నేనె తిన మన్నాను.'

నవ్వుకున్నాడు కృష్ణ.

'మరి నువ్వో, అమ్మా?'

అనుకోని ప్రశ్నకి నిరుత్తర అయింది, పార్వతి.

'నాకుతెలుసు అమ్మా, ఎవరికిపట్టినా పట్టకపోయినా నా గురించి నీవు మాత్రం భోజనం మాని కనిపెట్టుకొని ఉంటావు. అమ్మా.'

'పోన్లేరా. ఆకలి అన్నావు: ముందుతిను, నాయనా.'

'తిననమ్మా.' దృఢంగా అన్నాడు. కృష్ణ కూర్చునే.

'అదేమిరా?!'

'నువ్వు కూడా పెట్టుకో. ఇద్దరం తిందాము, కలిసే.'

'నేను తరువాత తింటాలేరా.'

'ఊహూ.' అని బలవంతంచేసి కూర్చోపెట్టాడు. ఇద్దరూ కలిసి తింటూ కష్టసుఖాలు వెళ్ళపోసుకొన్నారు.

'ఒక్కమాట చెపుతాను. కోపగించుకోవుగా బాబూ?' అంది పార్వతి.

'ఊహు. చెప్పమ్మా. కోపమెందుకు ?'

'నువ్వు ఇలా ఇల్లుపట్టకుండా తిరగటం ఏం బాగాలేదురా. నిన్ను నమ్మి కట్టుకున్న ఇల్లాలుంది. మా సంగతి అలావుంచితే, నువ్వు కోడలి కష్టసుఖాల్ని గురించయినా ఆలోచించాలి.'

'ఇప్పుడు దానికి ఏం తక్కువైందమ్మా?' నవ్వాడు.

'ప్రతి ఆడదీ భర్తనే నమ్ముకుంటుంది. భర్తనుంచి లాలనా పాలనా కోరుకుంటుంది. అది లభించనిరోజు మనసు విరుగుతుంది. అపుడు సంసారం నరకమౌతుంది. అది ఎవరికీ మంచిది కాదు. ఎవరూ ఆ పరిస్థితిని కోరుకోరు.'

'నేను మాత్రం ఏం చెయ్యనమ్మా. నేను దగ్గరకి వెళితేనే తను చిరుబుర్రు లాడుతుంది. నాపొడే గిట్టదు, దానికి.'

'అందుకు కారణం వుంది నాయనా. నువ్వు ఇల్లు పట్టకుండా ఇష్టంవచ్చినట్టు తిరిగి డబ్బు నాశనం చేస్తున్నావని తనబాధ. అంతేగాని కోడలు మంచిపిల్లేరా.'

'పోనీలే అమ్మా. నేను దుర్మార్గుణ్ణి, చెడ్డవాణ్ణి అనేగా నీ కోడలి ఆరోపణ? తనే మంచిది. నేనే చెడ్డవాణ్ణి. అని తను అనుకుంటే అనుకోనీ. ఇందులో పోయిందేముంది?'

'అదిగాదు బాబూ. నీ గురించి మీ నాన్న కూడ బాధపడుతున్నారు. అది గమనించాలి గదా.'

'ఏనాడూ ఆయన నేనంటేనే రుసరుసలాడ్తాడు. కాదు కూడదని మెడలువిరిచి పెళ్ళి చేసాడు. సుఖం లేదు. శాంతి లేదు. నేను ఇట్లాకూడా బ్రతకటం ఆయనకిష్టం లేదా అమ్మా?'

పార్వతి ఏడ్చింది.

'బాబూ! అటువంటి మాటలు అనవద్దు. నీ సుఖమే మేము కోరుకొనేది.' అంది.

మజ్జిగ అన్నం కలుపుకుంటూ కృష్ణ అన్నాడు. 'నువ్వు ఏడ్వకమ్మా. నేను చూడలేను. కానీ. అయ్యేదేదో అవుతుంది. కాదని మనం చేయగలిగింది లేదు. నేను అసలు చెడ్డవాణ్నే కాదమ్మా. నన్ను మీరు అందరూ కలిసే చెడ్డవాణ్ని చేశారు.' గద్గదికంగా అన్నాడు కృష్ణ.

'నువ్వు ఎన్నటికీ చెడ్డవాడివి కాదురా.' అంది పార్వతి నిశ్చయంగా: మొదలెట్టిన విషయం తేలకుండానే భోజనాలు ముగిసాయి.



ఎప్పుడూ అంతె. అర్థాంతరంగానే సంభాషణ ముగుస్తుంది.

చెయ్యి తుడుచుకొంటూ కృష్ణ గారాలు పోయాడు, పార్వతిదగ్గర పసివాడివలె.

'అమ్మా. అమ్మా. డబ్బుకావాలే.'

'డబ్బా! ఎంతరా?'

'ఐదువందలు'

'అంత మొత్తమే ఎందుకుబాబూ?'

కృష్ణ నసిగాడు. 'స్నేహితుడొకడు ప్రాణంమీదికి వచ్చి అడిగాడు. అతని భార్యకి




జబ్బుచేసి ప్రాణాపాయ స్థితిలో వుంది. పాపం అతను చాలా దయనీయమయిన స్థితిలో వచ్చి అడిగితే సరేనన్నాను. మాటదక్కించాలి అమ్మా'

'సర్లె చూద్దాంలె'

'అలాకాదు ఇపుడె ఇవ్వాలి మరి' బలవంతం చేశాడు.

ఇనప్పెట్టి తాళంతీసి డబ్బుచేతిలో పెడ్తూ అంది 'రేపట్నుంచి నువ్వు ఇంటిపట్టునే వుండాలి మరి. మంచి కొడుకువి, మంచి భర్తవి అన్పించుకొనాలి.

'అలాగేలేవే'

వంటగదిలో అన్నీ సర్దుకొని. పార్వతి నడుం వాల్చేసరికి, గదిలో కొడుకు కోడలు అర్థరాత్రి వాదులాడుకొంటున్నారు. ఆ కేకలికి పిల్లాడు లేచి ఏడ్వసాగాడు. అది గమనించకనే వాళ్ళు కేకలు వేసుకోవటంలో పడిపోయారు. ముందు వెనుకలు లేవు, మంచి చెడు లేదు. పిల్లచేష్టలు. వాళ్ల అరుపులకి ముసలాయన లేచి, చిరాగ్గా "వీడు ఇంటికేడ్చినట్లుందే. రాగానే రాద్ధాంతమా? ఛీ ఛీ వెధవ బ్రతుకు" అని చీదరించుకొన్నాడు. పిల్లవాణ్ని సముదాయిస్తూ వుండిపోయింది పార్వతి. ఆమె మౌనం ముసలాయన్ని రెచ్చగొటింది.

'ఇదిగో నిన్నే. నీకు బుద్ధుందా?' అని గర్జించాడు, పార్వతిని వుద్దేశించి. నిలువు గుడ్లు వేసుకొని చూసింది పార్వతి.

'వాడు ఈ రాత్రివేళవచ్చి పిలిస్తే తలుపెందుకు తీశావని అడుగుతున్నాను'– అని రెట్టించాడు ముసలాయన.

'సర్లెండి పడుకోండి'– అంది పార్వతి.

'నీమొహం పడుకోవాలి. ఛీ ఛీ ఏళ్లురాగానే సరా? అటువంటి వాణ్ని కన్నందుకు నువ్వు సిగ్గుపడాలే.'

'సరేలెండి'

'సరేనంటే కాదు. నలుగురు మొ... వ్వాస్తున్నారు. వాడు అసలు మనిషేనా అని. వాడు గొడ్డుకన్నా అన్యాయం అయిపోయాడు గదే. ఎందుకు నీ బతుకు వాడి బ్రతుకు? నలుగుర్లో పలచన. అల్లరి. ఛీ.'

'వూర్కోండి'

'నేనన్నది సబబుకాదంటావా? కాదంటే నన్ను చెప్పుచ్చుకుకొట్టు పడతాను' అరిచాడు, ముసలాయన. 'కాదని నేను ఎప్పుడన్నాను? మీరు చెప్పింది సబబే' గుండెల్లోని బాధని అణచుకొంటూ అంది, పార్వతి.

'మరి ఏంచెపుతావు?' రెట్టించాడు.

'రేపు చెపుతాగాని, పడుకోండి అసలే మీ ఆరోగ్యం మంచిదిగాదు. నాతప్పుని ఒప్పుకుంటున్నాగా పడుకోండి' అంది.

గొణుగుతూ పడుకొన్నాడు ఆయన.

అప్పటికి గుద్దులు, ఏడ్పులు, మొత్తుకోళ్ళు అయి గదిలో సందడి కూడా సద్దుమణిగింది. రోజూ ఇది మామూలె. అందుకె ఇరుగు పొరుగుపట్టించుకోరు. నిద దండగ ఎందుకని.

తెల్లవార్తూనే, తెల్లబట్టలు వేసుకుని

## పులిచంపిన లేడినెత్తురు

నల్లబూటు తొడుక్కొని జేబులో డబ్బు పెట్టుకొని ప్రయాణమయ్యాడు, కృష్ణ.

'మరలి ఎక్కడికిరా?' అంది, వాకిట్లో ఎదురయి పార్వతి.

'చెప్పాగా అమ్మా. స్నేహితుడికి డబ్బు ఇచ్చివస్తాను' అన్నాడు నమ్మకంగా.

'సర్లె. త్వరగా వచ్చెయ్యి' అంది. కృష్ణ వెళ్ళేక కోడలు యుద్ధం పార్వతితో పెట్టుకొంది. రెండు చేతులు కలవకపోయినా తప్పెటలు మోగించింది, గాలిలో. పార్వతి మౌనంగా వున్నకొద్దీ రెచ్చిపోయింది; కోడలు.

అది విన్న ముసలాయన చిరాకుపడి 'ఏమిటి గొడవ?'అని అడిగాడు. కోడలు చెప్పింది, వున్నదానికి మరింత అనుకున్నదాన్ని కలిపి.

'నిజమేనా?'అని అడిగాడు, రౌద్రంగా. అసలే చిరాకు మీదున్నాడు.

'అవును. బిడ్డ. కష్టం వచ్చిందని అడిగాడు. ఇచ్చాను'అంది పార్వతి. 'ఏట్లా అయితే కన్నావు బిడ్డని. బిడ్డలు ఎవరికిలేరు? నేను చెపుతున్నాను. విను నువ్వు. ఇదుగో. ఇట్లాగే చెడగొట్టటం. అందుకే నేను మొత్తుకొనేది' అన్నాడు. కంటతడి పెట్టింది పార్వతి.

'వాడు పూర్తిగా చెడిపోయాడు. నువ్వే చెడగొట్టావు. ముమ్మాటికీ నువ్వే. దానికంతటికీ నువ్వేకారణం' అని రంకెలు వేసాడు 'తాళాలు నీ చేతిలో పెట్టటం అసలు నాదే తప్పు. తీరిగ్గా కర్చు పెట్టుకుపోతే కొండలు కరుగుతాయి. ఏ కర్చుకయినా అర్థం పర్థం వుండాలి. నీకు మతిలేదు. వాడు వచ్చి, అడగటం తడవు తీసి ఇస్తావు'అని ఇనుపపెట్టె తాళాలు వూడలాక్కుని కోడలికి ఇచ్చాడు, ముసలాయన, ఆ కోపంలో.

కోడలు సంతోషపడింది. మొహం కళకళలాడింది. ఏ నాడు లేనిది ఆరోజు తనే పూనుకొని ఇంటిపనుల్లో సాయం చేసింది పార్వతికి. అంతా తనే అన్నట్లు ఇల్లంతా కలియ తిరిగింది. కొడుకుని ఎత్తుకొని పదేపదే ముద్దులు పెట్టుకొంది.

పార్వతి ఆ సాయంత్రం దొడ్లో దానిమ్మ చెట్టుదగ్గరుండగా దగ్గరకివచ్చి అడిగాడు ముసలాయన.

'కోపం వచ్చిందా? నిన్నే?'

'ఎందుకు?' అంది పార్వతి నిర్లిప్తంగా.

'అదే. తాళాలు లాక్కొని కోడలికిచ్చానని'

'ఇస్తే ఏమయిందిప్పుడు?'అంది. అతను ఆశ్చర్యపడ్డాడు.

'నువ్వు వట్టి పిచ్చి మొద్దువి. నాకు కోపం తెప్పిస్తావు మరి! తర్వాత అంత కోపమూ నీ అమాయికత్వం ముందు కరిగి నీరవుతుంది. అసలు అదిగాదు. వాడుపూర్తిగా చెడిపోయాడు. లేని చెడ్డ అలవాటు లేదు. పట్నంలో వీడు వేసే వేషాలన్నీ నాకు తెలుస్తూనే వున్నాయి. వాడు చెడిపోగూడదనే గదా నా ప్రయత్నం. అందుకే తాళాలుకోడలు పిల్లకి ఇస్తే, ఆరకంగానయినా దారిలోకి వస్తాడేమోనని...'

'నా బిడ్డ అటువంటివాడు కాదు. మీరు కానివాళ్ళ మాటలు నమ్ముతున్నారు' అంది, పార్వతి.

'అదేంగాదు. వాడు పూర్తిగా చెడిపోయాడు. నువ్వే గుడ్డిగా వాడి అబద్ధపు మాటలు నమ్ముతున్నావు నా మాట నమ్ము. వాడు ఇక బాగుపడి బట్ట కడతాడా అని!'

'పోన్లెండి.'

'ఎందుకు పోనివ్వాలి? వాడ్ని బాగుచెయ్యాల్సిన బాధ్యత మనకి లేదా? కనీసం ఆ ప్రయత్నమయినా చెయ్యాలి గదా. ఎన్ని అబద్ధాలు నేర్చాడు. నిలకడలేదు. ప్చ్.'

పార్వతి కన్నీరు పెట్టుకొంది. అది చూసి అతను చివ్వున లేచాడు.




కళ్ళజోడు లేకుండ మీరు కంటి చూపు పొందగలరు!

మీకు ఇంతకన్న ఎక్కువ ఆనందాన్నిచ్చేవార్త మరొకటి ఉంటుందా!

'కాంటాక్ట్ లెన్స్'లను వాడండి



ఈ 'కాంటాక్ట్‌లెన్స్'లు హ్రస్వదృష్టి, దూరదృష్టి మరియు అఫాకిక్ (కాటరాక్టు ఆపరేషను పిమ్మట), కెరాటోకోనస్, అనిసోమెట్రోపియా, అనిసికోనియా, పాలియోపియా మొదలైన దృష్టిదోషములు కలవారికి ఉత్తమమైనవి.

'కాంటాక్ట్ లెన్స్'లను మీ కంటి పాపలకు మీకుమీరే సులభంగా పెట్టుకొనవచ్చును... తీసివేసికొనవచ్చును - కొద్దిదినముల అభ్యాసంతో, మీ కళ్లకు పెట్టుకొన్న చిన్న 'కాంటాక్ట్ లెన్స్'లు ఇతరులకు అగుపించవు. కనుక మీ సుందర ముఖంలో ఎట్టిమార్పును వుండదు.

మీ కంటి వైద్యుని సంప్రదించండి

ఇతర వివరములకు:

ఆసియా కాంటాక్ట్ లెన్స్ లేబొరెటరీ

4/1, ఆండర్సన్ రోడ్,

మద్రాసు-600 006

ఫోన్:

87033

'ఎందుకు కన్నీరు? ఒక్కగానొక్క కొడుకని గారంచేసి నువ్వే వాడ్ని చెడగొట్టావు. ఇప్పుడు ఏడ్చి మొత్తుకొని ఏం లాభం?' అన్నాడు. పార్వతి రోషాన్ని తొక్కిపట్టి అంది.

'అది కాదు ఇష్టంలేని పెళ్లిచేసి మీరే వాడ్ని పిచ్చివాడ్ని చేసారు' అంది పార్వతి ఆవేశంగా. ముసలాయన తెల్లబోయాడు. కాసేపటికి తెప్పరిల్లి.

'సరే. అయిపోయింది. అయిపోయింది గనుక సర్దుకు పోవాలిగాని పాడయి పోవటమే పరిష్కారమా? వెనకాల ఆ'నలుసొ'కడు ఎదిగి వస్తువుండె కనీసం నీ కొడుకు వాడ్ని గురించయినా బుద్ధి తెచ్చుకోవాలా? వద్దా?' అన్నాడు.

పార్వతి మౌనంగా వుండిపోయింది. 'చదువు లేదు. పోనీ పనీ పాటా అంటే అదీ లేదు. ఇష్టానుసారం ఆడింది ఆటగా పాడిందిపాటగా వాడి వేషాలు సాగనిచ్చి నువ్వే వాడ్ని చెడగొట్టావు. అసలు దీనంతటికీ నువ్వే కారణం' అన్నాడు. అని, రుసరుసలాడుతూ బయటికి వెళ్లిపోయాడు.

ఆ వెళ్లటం వెళ్లటం మూడోనాడు రాత్రికిగాని జేబుకాళీ అయినాక గాని దిగలేదు కృష్ణ. అన్నాళ్లూ కళ్లు కాయలు కాసేట్టు చూసింది పార్వతి. అడిగితే కన్నమనసు కాదన లేదు. ఎప్పటి కప్పుడు ఇంతే. మాయ మాటలు చెపుతాడు. గుండెల్లో జాలి పుట్టిస్తాడు. కొడుకు కొడుకు అని కొడుకు కోసం తపించి నందుకు అందరూ పార్వతినే అంటారు. పోనీ, అంటేఏం?

'అమ్మా! అమ్మా!' అర్ధరాత్రివేళ ఆ పిలుపు విని తలుపు తీయటాన్కి వెళ్లింది పార్వతి. అప్పటికే కోడలు లేచి వెళ్లి తలుపు తీసింది; మొగుడికి మంచి పరిణామమే. ఎవరయినా కావాలనుకొనేదే,

కాని—మాటలు పేలేయి. చిటపట మన్నాయి. బాణాల్లా గుండెలలో సూటిగా దిగినయి. రుసరుసలాడుతూ గదిలోకి వెళ్లింది కోడలు.

'అమ్మా' అంటు వచ్చేడు కృష్ణ.

'ఏం బాబూ?'

'అన్నం పెట్టమ్మా. ఆకలిగావుంది.'

'ఇన్నాళ్లకి ఆకలి గుర్తు వచ్చిందా, తండ్రీ?' నీర్సంగా అంది.

'అవునమ్మా. ఆకలి గుర్తు వచ్చింది. వెంటనే అమ్మా గుర్తుకి వచ్చింది. అందుకే వచ్చేసానమ్మా, ఇంటికీ నన్ను క్షమించమ్మా'

'అన్నం మెత్తబడింది బాబూ; కూరమాడి పోయింది, నా మనసుకి మల్లేనే, బాబూ. అవే పెట్టనా' గాద్గదికంగా అంది. మమత శోకపు వెల్లువే అయింది. కృష్ణ ఏడ్చాడు. 'అంత మాట అనకమ్మా ఏదో ఒకటి నీ చేత్తో పెట్టమ్మా. అదే నాకు అమృతం.' అన్నాడు కళ్లు తుడ్చుకొని.

పార్వతి కన్నీరు తుడుచుకొని అన్నం పెట్టింది. తనూ పెట్టుకొంది. అన్నంతింటూ మరల పాతపాటే పాడేడు. జాలినిపుటించేడు. ఏడ్పు ఏడ్చేడు. అన్నీ తెలిసి మరల మమత యొక్క మాయలో పడింది పార్వతి.

'అమ్మా, ఇప్పుడు డబ్బుకట్టకపోతే నన్ను జైల్లో పెడతారే' అన్నాడు కొడుకు. 'ఎలాగోలాగు నన్ను రక్షించుకోమ్మా.'

'నేనేంచెయ్యను? ఇప్పుడు నా చేతిలో ఏంలేదురా బాబు! తాళాలు లేవురా.'

'అమ్మా. ఎట్లాగే? నేను చెడిపోయిన వాడ్నే. అబద్దాల కోరునే. ఐనా, నీ కొడుకుని కాకపోతానా?'

'నన్నేంచెయ్య మంటావురా?' అంటు ఏడ్చింది పార్వతి.

'సర్లె.' అంటు లేచిపోయాడు, అన్నం దగ్గర్నుంచి కృష్ణ.

'ఆ మర్నాడు తెల్లవారేటప్పటికే కృష్ణ వెళ్లిపోయాడు. పార్వతి నిద్రలేచి మెడ తేలికగా అన్పించి తడిమి చూసుకొంది. అక్కడ వుండవల్సిన 'నానుతాడు' గొల్సు లేదు! పదినవర్సులు బంగారం. పోన్లె అను కుని పనుల్లో పడింది. కాని ఆ మధ్యాన్నాని కల్లా కోడలు కనిపెట్టేసి ముసలాయనకి వూదింది.

ముసలాయన నిగ్గదీసాడు. దోషిగా నిల బెట్టాడు పార్వతిని. 'నీ మెళ్లోది ఏమయింది?' అని అడిగాడు.

'నేనే ఇచ్చాను' అంది.

'ఎందుకిచ్చావు? ఎవర్నడిగి ఇచ్చావు?' అన్నాడు, కోపంగా. గంతులు వేసాడు. కోడలు ముసిముసిగా నవ్వింది. పార్వతికి జవాబు తట్టలేదు. ఏదోఒకటి చెప్పింది

'ఇచ్చాను. కొడుకు కావాలని అడిగితే ఇచ్చాను. ఏం?' అంది పౌరుషంగా.

చంపి పేలింది. ముసలాయన చేతి అయిదు వేళ్లూ ముద్ర పడి గబ గబ పొంగుకొచ్చాయి. విసురుగా బయటికి వెళ్లిన ముసలాయన


డా. శ్రీనికేరావ్, B.A., సెక్స్ స్పెషలిస్ట్



వైద్యవిద్వాన్ — వైద్యాచార్య హస్తప్రయోగం, నరముల బలహీనత, అంగము చిన్నదగుట, శీఘ్రస్ఖలనము, శుక్లనష్టము, సుఖరోగములకు, మానసిక వ్యాధులకు శాస్త్రీయ చికిత్స, విదేశ యంత్రములతో ప్రత్యేక చికిత్స, పోస్టుద్వారా కూడా చికిత్స గలదు.

రాహుస్ క్లినిక్

టి. బి. రోడ్, తెనాలి. ఫోన్: 700

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సా
విరేపనముతో
చికిత్సను పొందండి
— శస్త్రచికిత్స
అవసరములేదు!

మీకు సంతానం లేదా?



ఆపరేషన్, యితర వైద్య చికిత్సలచె నిరాశ చెందిన సోదరీమణు లనేకులు మా సలహాలచే సంతాన వంతులయి యిచ్చిన యోగ్యతా పత్రములు గలవు. స్త్రీ పురుష వంధ్యాదోష నివారణ నిపుణులు.

ఉచిత వివరములకు

శ్రీ నాగార్జున మూలిక కుటీరం

రైల్వేస్టేషన్ వద్ద, రామాలయం వీధి,
తెనాలి - 2.

సాయంత్రానికి గాని ఇల్లు చేరలేదు. రాగానే, దగ్గరకి వచ్చి కొబ్బరినూనె తీసుకొచ్చి పొంగిన చంపకి రాశాడు. 'పార్వతీ నన్ను క్షమించు. నేను రాక్షసుడ్ని' అన్నాడు.

'పోన్లెండి మర్చిపోండి' అంది క్షమించి.

'కాదు. కాదు. నేను మొరటువాడ్ని, మాయ మాంత్రికుడ్ని, నా పోలికలే నా కొడుక్కి వచ్చాయి. చేసుకున్నందుకు నేను, కన్నందుకు వాడు నిన్ను చంపుకు తింటున్నాము. మమ్మల్ని ఏంచేసినా పాపం లేదు పార్వతీ!' అంటూ కంటతడి పెట్టాడు. ఆ కళ్లు తుడిచి, ముసలాయన్ని అనునయించి తనలోనె పార్వతి నవ్వుకుంది.

'సర్లెండి వూర్కోండి. ఏం మాటలవి?' అని మందలించింది.

శ్రావణ శుక్రవారం పేరంటానికి వెళ్లింది పార్వతి. తిరిగివచ్చేసరికి ఇల్లు గందరగోళంగా వుంది. దద్దాయాగంగా వుంది.

ముసలాయన కర్రపుచ్చుకొని కోపంతో రంకెలు వేస్తున్నాడు. కోడలు నానా గగ్గోలుగా అరుస్తూవుంది. నలుగురూచేరి వింత చూస్తున్నారు.

## పులిచంపిన లేడినెత్తురు

అంతలో —

మాసిన బట్టలతో — పెరిగిన గడ్డంతో, లోతుకుపోయిన కళ్లతో, ఆ కళ్లలోని ఎరుపుదనంతో పిశాచంవలె వున్న ఒక మనిషి గడ్డపలుగు ఒకటి తీసుకువచ్చి,ఇనప్పెట్టె బద్దలు కొట్టటం ప్రారంభించాడు.

'ధన్ ధన్' మని మోగిపోతూ వుంది, గుండెలు అదిరేటట్టు.

'కృష్ణా! ఒరేయ్. చంపుతాను. పో. అవతలకి పో.' అంటూ గర్జించాడు ముసలాయన. కోపంతో, అసహ్యంతో వణికిపోతున్నాడు ఆయన. ముసలాయన చేతిలోని కర్ర పైకి లేచింది విసురుగా.

పార్వతి నిలువెల్లా వణికిపోయింది.

'నాయనా! కృష్ణా. ఆగు. నా మాట విను.' అంటు పరుగెత్తి కొడుకుని కావలించుకొనింది; కావలించుకొని ఏడ్చింది. గుండెలు పగిలేట్టు శోకించింది. మనసు ద్రవీభూతమై బాధాతప్తమయింది. మమత పొంగి కాల్వలు కట్టింది. క్షణాలు గడిచాయి.

అప్పటికే —

అయిపోయింది. అకార్యం జరిగిపోయింది, అనుకోకుండానె.

పార్వతి తల పగిలి, రక్తం పొంగింది.

పొంగి కొడుకుని ముంచివేసింది, ఎర్రగా.

'అమ్మా!' — అమ్మ గుండెలలోని మమతాఝురులని గుర్తించలేక ఇంతకాలమూ అమ్మని మోసం చేయటానికే అలవాటు పడిన నీచుడయిన కొడుకు భయవిహ్వాలుడై ఆక్రోశించాడు.

'పార్వతీ'— కోమలమయిన ఆ మనసుని కర్కశంగా శాసించటమూ, అణచి వుంచడమూ మాత్రమే తెలిసిన ముసలాయన, కన్నుచెదిరి గుండెలు పగిలేలా అరిచాడు.

'అత్తయ్యా' — స్త్రీత్వంలోని సున్నితత్వాన్నీ గొప్పదనాన్నీ గ్రహించి అనుసరించటానికి నిరాకరించిన కోడలు కెవ్వున అరిచింది!

ముగ్గురూ గోడుగోడున ఏడ్చారు!

ఎవరు ఎన్నివిధాలుగ ఏడ్చి ఉపయోగం లేదన్నట్టు, స్మశానంలోంచి ఒక నక్క తన ఏడ్పూ ఏడ్చింది.


శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి
సీరియల్ "కీర్తికిరీటాలు"తో మార్చి75 సంచిక వెలువడింది!

నవలల ధర ఎక్కువ
నవలతో పాటు నాలుగు
రుచులున్న స్వాతి వెల తక్కువ



నెలనెలా ఒక సరికొత్త నవలకోసం
కొత్తగా నిండుగా వుండే కథలకోసం
"స్వాతి" వేదికగా నిలిచింది.

స్వాతి
సచిత్ర మాసపత్రిక * గవర్నర్‌పేట * విజయవాడ 520002